మా అవుట్ హౌస్ ముందున్న బొప్పాయి, జామ, అరటి చెట్టు మీదెక్కి ఇరవై దాకా కోతులు రచ్చ రచ్చ చేస్తున్నాయి. పచ్చివా, పండినవా అని చూడకుండా కాయలు తెంపి తింటూ కింద పడేస్తున్నాయి. షెడ్డు మీద నుంచి చెట్ల మీదకు అక్కన్నుంచి కాంపౌండు వాల్ మీదకు దూకుతూ సర్కస్ ఫీట్లు చేస్తున్నాయి.

కోతులు వచ్చాయంటే మా పిల్లలకు మహా సరదా! ఆఫ్రికన్ సఫారీలో సింహాల్ని గజం దూరం నుంచి చూసినంత ఆనందపడేవాళ్ళు! తల్లి కడుపుకి గట్టిగా అతుక్కుని పట్టుకున్న కోతి పిల్లల్ని డిజిటల్ కెమెరాలో బంధించే వాడు మా పెద్దబ్బాయి. వాటి తల్లులు చెట్ల మీద నుంచి షెడ్డు మీదకు, గోడ మీదకు దూకుతుంటే అవెక్కడ పడిపోతాయోనని తెగ భయపడిపోయేవాడు మా చిన్నబ్బాయి. కిష్కిందకాండ ముగిసింది. గార్డెనంతా ఆకులు, కొమ్మలు రెమ్మలు రాలి పడి చిందరవందగా తయారైంది.



# సదువుకున్నోళ్ళు

**- డాక్టర్ నక్కా విజయ రామరాజు**

ఆ వానర సైన్యం వచ్చినప్పుడల్లా వాటి చేష్టలు నా శ్రీమతి నందినికి నచ్చేవి కావు.

''శుభ్రంగా కాయలు తినిపోక ఆ షెడ్డు మీద దూకడం ఏమిటి? కొమ్మలు, రెమ్మలు, విరగొట్టటం ఈ చండాలమంతా ఏమటని'' గొణుక్కునేది. కోతులు పట్టేవాళ్ళని పిలవండని ఒకసారి, ఉన్న నాలుగు చెట్లు నరికి పారేస్తే కోతులు పీడ విరగడై పోతుందనింకోసారి కోపంతో కుతకుతలాడేది.

ఆ వానర సైన్యం మనం పిలిస్తే వచ్చాయా? పొమ్మంటే పోటానికి? సడెన్‌గా అనుకోని అతిధుల్లా ఎప్పుడో అమావాస్యకో, పున్నమికో వచ్చి గంటలో పని ముగించుకుని వెళ్ళిపోయేవి.

''బుద్ధిగా ఓ డజను దోరజాంపడ్లు, ఓ అరడజను బొప్పాయి పండ్లు, నాలుగైదు హస్తాలు అరటిపండ్లు తినేసి బ్రేవ్ అని త్రేపి మూతిని తుడుచుకుని, థాంక్స్ చెప్పేసి వెళ్ళిపోతే అవి కోతులెలా అవుతాయోయ్?'' అనే వాణ్ణి. ఈ కాంక్రీట్ జంగిల్‌లో ఆ మాత్రం నాలుగు చెట్లుండడమే గ్రేట్! ఇప్పటికే ఇంటి ముందు ప్రేమగా పెంచుకున్న పూలతో ఉన్న గుల్‌మొహర్ చెట్టుని నిర్దాక్షిణ్యంగా కొట్టేశారు కరెంటోళ్ళు. కనీసం కాంపౌండ్‌లో ఉన్న ఈ నాలుగు చెట్లయినా ఉండనీయ్! స్వచ్ఛమైన ఆక్సిజన్ దొరుకుతుంద''నేవాణ్ణి.

''అయితే కోతులు రాకుండా ఏదైనా ఏర్పాటు చేయండి'' అనేది నందిని. ''వాటికి మన మీదేమన్నా ప్రేమా? అవేమన్నా నా బంధువర్గమా? నా మామగారి తాలుకానా? వాటికి మాత్రం అడవి నుంచి ఇంత దూరం రావడం అంత తేలికైన పనా? వాటినే స్థిరంగా అడవుల్లో ఉండనిస్తే ఈ జనారణ్యంలోకి ఎందుకొస్తాయి? మనిషి స్వార్థంతో అడవులను ఆక్రమించుకుని చెట్లను నరికేస్తుంటే...వాటికి తినడానికి, ఉండడానికెక్కడిది?! వాటి స్థలాల్ని మనం ఆక్రమిస్తూ అవే వచ్చి మన మీద పడుతున్నాయంటే ఎలాగోయ్?'' అంటూ ఆ వానర సైన్యానికి సపోర్టుగా మాట్లాడేసరికి...నన్నొక వాలిగానో, సుగ్రీవుడిలాగో చూసినట్టు చూసి కోపంగా ఇంట్లోకి వెళ్ళిపోయేది నందిని.

***

అవుట్‌హౌస్ అనబడే రేకుల షెడ్డులో ఎప్పన్నుంచో బాలమ్మ, పోలయ్య వారి పిల్లల్తో కలిసి ఉంటున్నారు. పిల్లల్లో పెద్దది అమ్మాయి. ఏదో ప్రయివేట్ కంపెనీలో పనిచేసేది. బాలమ్మ హాస్పిటల్‌లో పనిచేస్తే-పోలయ్య ఏ పనంటే అది చేసేవాడు. అబ్బాయి చిన్నోడు. పదోతరగతి ముక్కి మూలిగీ అత్తెసరు మార్కుల్తో పాసయ్యాడు. అతన్ని డాక్టర్ చెయ్యాలని బాలమ్మ కోరిక. గవర్నమెంట్ కాలేజీల్లో అయితే సరిగ్గా చదువు చెప్పరని ప్రయివేట్ కాలేజీలో భారీ మొత్తంలో ఫీజులు కట్టి చేర్పించింది. ఫస్టియిర్ అయిపోయింది. అన్ని సబ్జెక్టుల్లో తప్పాడు. సెకండియర్

అసలు పరీక్షలే రాయలేదు. ఆ సంగతి తర్వాత ఎవరో చెబితే గాని తెలీలేదు బాలమ్మకు పాపం!

తినడం, టివి చూడ్డం, టిప్ టాప్‌గా తయారై తిరిగి రావడం బాలమ్మ కొడుకు పని. లేబ్ టెక్నీషియన్ కోర్సు చేస్తే వెంటనే లేబ్ పెట్టుకొని బోల్డంత సంపాదించొచ్చని ఎవరో బాలమ్మకు చెబితే ఆ కోర్సుల్లో డబ్బులు కట్టి ప్రైవేట్ ఇనిస్టిట్యూట్‌లో చేర్పించింది కొడుకును. అదీ మూనాళ్ళ ముచ్చటే అయ్యింది! యూరిన్, మోషన్, బ్లడ్ టెస్ట్‌లు నేర్చుకోవాలి. ఆ ఛండాలం పనులు చెయ్యనని మధ్యలోనే మానేసి వచ్చాడతను. ఆ తర్వాత మామూలే! టీవి, తిండి, నిద్ర రిలీజయ్యే సిన్మాలతో కాలం గడపసాగాడు బాలమ్మ కొడుకు.

మూడు నెలల తర్వాత-ఏదో బట్టల పౌడర్ కంపెనీలో పది వేలు కడితే తన కొడుక్కి మేనేజర్ ఉద్యోగం ఇచ్చారని చెప్పింది బాలమ్మ. నాలుగు నెలల దాకా అతన్నుంచి ఉత్తరం లేదూ, ఫోనూ లేదు. ఐదో నెలలో ఒకసారి ఫోన్ చేసి "ఇంకో ఇరవై వేలు కడితే జనరల్ మేనేజర్‌గా చేస్తారంట" అని చెప్పాడు. "ఇంతకు ముందు తెచ్చిన దానికే వడ్డీలు కట్టలేక ఛస్తున్నా. నాతో కాదు వచ్చేయ్ బాబూ" అనంటే-తిరుగు టపాలో ఇంటికి తిరిగొచ్చేశాడు పట్నం నుంచి. ఆ నాలుగు నెలల్లో ఏం చేసింది? జీతం ఎంత వచ్చింది? బాలమ్మకు చెప్పలేదు అతను.

పట్నం నుంచి తిరిగొచ్చిన బాలమ్మ కొడుకు ఏ పనీ ముట్టుకునే వాడు కాదు. పగలు, రాత్రనకుండా టీవి చూడడం, లేట్‌గా లేవడం, టిప్ టాప్‌గా తయారై ఊరంతా బలాదూర్ తిరిగిరావడం, స్నేహితుల్తో కలిసి అర్థరాత్రి దాకా కబుర్లు. ఒకసారి "ఖాళీగా ఉంటున్నట్టున్నాడు. మీ అబ్బాయిని ఏదైనా పనిలో పెట్టొచ్చుగా బాలమ్మా?" అని అడిగితే-

"పట్నంలో పెద్ద ఉజ్జోగం చేసొచ్చినోడు చిన్నా చితకా పనులేం చేస్తాడు సార్" అంది అతని గురించి మరెప్పుడూ అడగలేదు.

***

ఊరు నుంచి మా అక్క ఫోన్ చేసి, "పాలిటెక్నిక్ చదివిన నీ మేనల్లుడు ఏ ఉద్యోగం లేక-స్నేహితుల్తో, సినిమాల్తో చెడిపోతున్నాడని, నీ దగ్గరకు పంపుతున్నా ఏదన్నా పనిలో పెట్టంటూ" చెప్పింది. పంపమన్నాను. తెల్లారే సరికల్లా దిగిపోయాడు నా మేనల్లుడు. పేపర్ కూడా చదవడు. లేట్‌గా లేవడం, తినడం, టీవి చూడడమే అతని దినచర్య. "జావా, శాప్ లాంటి కంప్యూటర్ కోర్సుల్లాంటి వాటిల్లో చేర్పించవచ్చుగా?" అంటూ నందిని సలహా ఇచ్చింది. ఒకరోజు తెలిసిన ఇనిస్టిట్యూట్ ఉంటే చేర్పించా. వారం రోజులు కూడా సరిగ్గా పోలేదు. మధ్యలోనే మానేశాడు. కంప్యూటర్ ముందు కూర్చోవాలన్న కోరిక, నేర్చుకోవాలన్న శ్రద్ధ ఉంటే కదా! వాడిష్టం అని వదిలేశా! మధ్యలో ఒకసారి ఫోన్ చేసింది అక్క. "అబ్బాయికి ఇబ్బందేం లేదుగా" అనడిగింది. "దివ్యంగా ఉన్నాడు వాడికేం?" "బయటెక్కడికి పంపకు లోకం తెలీనోడు" అంది. "అసలు బయటకే పోడు" అన్నాను.

ఒకరోజు హడావిడిగా నా దగ్గరకొచ్చింది బాలమ్మ. "అబ్బాయిని దుబాయ్ పంపుతున్నాననీ, టిక్కెట్‌కు, ఏజెంట్‌కు కలిపి లక్ష రూపాయల దాకా అవుతుందని-అక్కడ నెల జీతం ఇరవై వేలు పైనే ఇస్తారని చెప్పింది. లక్షరూపాయలు అప్పుగానైనా ఇవ్వండి. లేకపోతే నెలనెలా జీతంలోనైనా కట్ చేసుకోండి" అంది. "అంత డబ్బు నాతో కాదని" ఖరాఖండిగా చెప్పేశా! "దుబాయ్ పోయినోళ్లంతా తిరిగొస్తుంటే, ఇతనెళ్ళి ఏం చేస్తాడంటా?! వెంటనే తిరిగొస్తే ఇంకా నష్టం కదా" అన్నాను. వినకుండా పదిరూపాయల వడ్డీకయినా తెస్తానని పట్టుదలతో చాలా మంది దగ్గరకు తిరిగింది. ఆమెకు ఎక్కడా అప్పు పుట్టలేదు.

నా మేనల్లుడి సంగతి చూద్దామంటే- మునుపటిలాగే తినడం, టీవీ చూడడం, బోర్ కొడితే బయటకెళ్ళి కొత్త సిన్మాలు చూసి రావడంతో సరిపోతోంది. "కోతులు వచ్చినప్పుడు తోలమన్నా తోలడం లేదని. బ్యాంకుకు పంపితే డిడి ఎలా కట్టాలో తెలీక తిరిగొచ్చాడనీ, కరెంట్ బిల్లు కట్టమని పంపితే చాంతాడంత క్యూ ఉందని, కూరగాయల కోసం మార్కెట్‌కు పొమ్మంటే పట్టించుకోలేదంటూ దీర్ఘం తీసింది నందిని. "ఎంత చదువుకొన్నా ఇంట్లో పనులు చేసుకుంటే తప్పా?" అంది. "స్కూల్లో, కాలేజీలో ఇవన్నీ చెప్పరులే" అంటూ కవర్ చేశాను. వాడికి మాత్రం చీమ కుట్టినట్టన్నా లేదు.

***

బొప్పాయి కాయలు తయారయ్యాయి. అరటిగెలొకటి చెట్టు మీదే పండింది. మేనల్లుడికి చెబితే రేపు కోస్తానన్నాడు. "నిచ్చెన, తాళ్ళు ఉన్నాయా?" అనడిగాడు. ఫర్వాలేదు పనికి వంగేలా ఉన్నాడనుకొన్నాను.

కాయలు పండినట్టు వార్త వాటికెలా తెల్సిందో- ఆ తెల్లారే వానర సైన్యం వచ్చి వాలింది. కాయలు తెంపుకుని షెడ్డు మీద కూర్చుని వనభోజనాలు చేసి, తాపీగా వెళ్ళిపోయినాయి. "ఇంట్లో కూర్చుని టీవి చూస్తున్నాడు. కనీసం కోతులనైనా తోలకపోతే ఎట్లాగండీ? కష్టపడి పెంచుకున్నాం. ఒక్క కాయ కూడా తినకుండా నాశనం చేస్తున్నాయ్ వెధవ కోతులంటూ" వాటి మీద కోపమంతా నా మీద చూపించింది నందిని. "ఏరా కోతుల్ని తోలకపోయావా?" అనడిగితే, "కోతులు పైన బడి కరిస్తే" అంటూ ఎదురు సమాధానం చెప్పాడు నా మేనల్లుడు. "ఇంత చదువు చదివింది కోతులు, కుక్కల్ని తోలడానికా!" అంటూ గొణుక్కున్నాడు మెల్లగా.

నెల రోజుల తర్వాత బాలమ్మ కొడుకు నా దగ్గరకొచ్చాడు. నీట్‌గా డ్రస్ చేసుకుని-టక్, టై చేతిలో బ్రీఫ్ కేస్‌తో కార్పొరేట్ కంపెనీ ఏజెంట్‌లాగా ఉన్నాడు. "పదినిమిషాలు టైం ఇస్తే మా కంపెనీ గురించి చెబుతానంకుల్" అన్నాడు. "సరే" అన్నాను.

"ఇది అమెరికాలో చాలా పెద్ద కంపెనీ" అని ఒక కంపెనీ గురించి చెప్పి-"ప్రపంచంలో ఏ ఇద్దరి ఆలోచనలు ఒకటిగా ఉండవని మొదలుపెట్టాడు. "ఇప్పుడు మీరు సంపాదించేది రేపు ఎలా ఉంటుందో తెలీదని, ఆ కంపెనీలో జేరితే నెల నెలా పెన్షన్‌లాగా బోలెడు డబ్బు వస్తుందని, ఆ కంపెనీకి యాడ్ లుండవు కనుక ఆ కమీషనంతా ఏజెంట్లకే జేరుతుందని... ఆల్బమ్ లాంటిది తీశాడు. "ఇతను ఒకప్పుడు- తిరుపతిలో ఆటో డ్రైవర్. మరిప్పుడు బంజారాహిల్స్‌లో పెద్ద బంగళా, కార్లు, నౌకర్లు. ఇంకో ఫోటో చూపించి ఇతను ఒక కంపెనీలో వాచ్‌మెన్. మరిప్పుడు గొప్ప బిజినెస్ మాగ్నెట్టు" అంటూ పెద్ద క్లాసు తీశాడు. ఆ కంపెనీలో ఏజెంటుగా నన్ను చేరమని కోరాడు. ఆ కంపెనీ మందులు, టూత్‌పేస్ట్‌లు అమ్మకపోయినా ఫర్వాలేదంట. ఇంట్లో వాడుకోవచ్చన్నాడు. సంవత్సరానికొకసారి క్రూయిజ్‌లో టెన్‌డేస్ వరల్డ్ హాలిడే ట్రిప్పు ఫ్రీ అని కూడా చెప్పాడు. "అట్లాంటి అద్భుమైన కంపెనీల గురించి చెప్పి నా టైం... నీ టైం... వేస్ట్ చేసుకోవద్దు. స్థిరంగా ఉండే ఏదైనా ఉద్యోగం చూసుకోమని" సలహా చెప్పేసరికి వెళ్ళిపోయాడు.

***

వర్షాకాలం మొదలైంది. ఒకరోజు ఎక్కడనుంచో ఒక మచ్చల పిల్లి రెండు పిల్లి కూనల్ని తెచ్చి మా మెట్ల

## ఒకొక్కప్పుడు....




ఒకొక్కప్పుడు కోపం
కప్పులోని వేడివేడి టీ లా
ఆవిర్లు కక్కుకుంటుంది!
దానికి-
చిక్కటి పాలులాంటి సహనాన్నిచ్చి
శాంత పరుస్తుంటాను....
ఒకొక్కప్పుడు శాంతం
పావురంలా ఆకాశంలో కెగసిపోతుంటోంది!!
ఎంతెత్తెగిరినా-
దాని ఆకలి తీర్చే గింజలు
భూమి మీదే కదా ఉండేది...
ఒకొక్కప్పుడు నిజాయితీ రక్తాన్ని
నింపుకున్నందుకు ఏమీ ప్రయోజనం లేదని
నామీద నాకే అసహ్యమేస్తుంటుంది!
ఎంతైనా అవినీతి బురద మధ్యలో
బంగారు దేహం మెరుపులు మెరవక తప్పదు కదా!!
ఒకొక్కప్పుడు అదేంటో
నా చుట్టూ ఉన్నవాళ్ళంతా నా వాళ్ళేనని
తెగ పొంగిపోతుంటాను!
పాలపొంగు గృహ ప్రవేశానికి మంచిదేమో గాని
తాగేందుకు కాదుకదా అన్నట్లుంటుంది వాళ్ళ ప్రవర్తన!!
ఒకొక్కప్పుడు వైరాగ్యంతో
ఈభూమిని వదిలి పోవాలనుకుంటుంటాను
కాని-
భూమిని విడిచి ఎక్కడికి పోగలను?!!
కలిస్తే మట్టిలో, కాలిస్తే బూడిదలో చేరి
నేల తల్లిని ముద్దాడవల్సిందే కదాని తెలుసుకొని
అచేతనాన్ని వదిలి
బాధ్యతలతో నిర్వర్తించేందుకు
విధివైపు ఒంటరిగా దూసుకుపోతాను!!

-చలపాక ప్రకాష్

సెల్: 92474 75975

గది కింద ఉంచింది. ''మియావ్...మియావ్..'' అంటూ మా పిల్లలు వాటి చుట్టూ తిరగసాగారు. అవి కళ్ళు కూడా సరిగ్గా తెరవలేదు. నందిని ప్లేటు నిండా పాలు పోస్తే చిన్నబ్బాయి వాటి ముందు ఉంచాడు. అవి కడుపు నిండా తాగి ఆడుకుంటుంటే పెద్దబ్బాయి ఫోటోలు తీశాడు. రెండు మూడురోజుల దాకా మా పిల్లలకు వాటితోనే లోకం. ఒకరోజు సడెన్‌గా ఏడుపు ముఖంతో మా చిన్నబ్బాయి నా దగ్గరకొచ్చి ''పిల్లి పిల్లలు కనబడ్డం లేదు డాడీ!'' అన్నాడు.

''పిల్లి పిల్లల్ని ఒక చోట ఉంచదురా. ఏడు ఇళ్ళు తిప్పుతుంది. తల్లి ఆ కూనల్ని నోటితో కరుచుకుని తీసు కెల్తుంది. అవి బాగా పరిగెత్తగలిగినప్పుడు, ఎలుకల్ని ఎలా వేటాడాలో నేర్పుతుంది. అలా అవి వేట నేర్చు కున్న తర్వాత...తన దగ్గర ఉండనీయదు. తరిమే స్తుంది. దాన్నే మార్జాల కిశోర న్యాయం'' అంటారని మా ఇద్దరి పిల్లలకు పిల్లి తత్వం గురించి విడమరిచి చెప్పాను.

''మరి కోతులెప్పుడూ తమ పిల్లల్ని నోటితో కరిచి పట్టుకోవు కదా! పిల్లలే వాటి మమ్మీల కడుపుకి ఫెవి కాల్ అంటించినంత గట్టిగా అంటిపెట్టుకుని ఉంటా యిగా డాడీ! ఎందుకలాగా?'' అని అనడిగాడు మా పెద్దబ్బాయి.

''పడిపోకుండా పట్టుకోవడం ఆ కోతిపిల్లల బాధ్యత. తల్లి ఎక్కడ కాయలుంటే ఆ చెట్టు మీదకు దూకుతూవెల్తుంది. కాయలు తెచ్చి పిల్లలు పెద్దయ్యే దాకా పెడుతుంది. ఆ తర్వాత ఆ పిల్లలు సొంతంగా ఆహారాన్ని సంపాదించుకుంటయ్! దీన్నే మర్కట కిశోర న్యాయం'' అంటారని చెప్పాను. మా చిన్న బ్బాయ్ పరిగెత్తుకుంటూ వచ్చి, ''డాడీ! ఆ పిల్లి పిల్లలు ఎదురింటి తాతయ్య గారి మెట్ల గదిలో ఉన్నా యంటూ'' సంతోషంగా చెప్పాడు. పిల్లి పిల్లలు అక్కడ సురక్షితంగా ఉన్నందుకు మా పెద్దబ్బాయి కూడా హ్యాపీ! పిల్లలిద్దరూ నా మాటలు పట్టించుకోకుండా పిల్లి పిల్లల్ని చూడడానికి ఎదురింటికి పరిగెత్తాడు.

వర్షాలు పడుతూనే ఉన్నాయి. ఈ సంవత్సరం పర్వాలేదు. సరిపడా వర్షాలు కురిసేలా ఉన్నాయి. చెట్ల ఆకుల మీద పడే వాన చినుకులు చిటపట సంగీతం వినటం నాకెంతో ఇష్టం! వరండాలో కూర్చుని బిస్మిల్లా ఖాన్ షెహనాయ్ లాగా వానచినుకులు సంగీతం ఎంజాయ్ చేస్తున్నాను. పొగలు కక్కే రెండు కాఫీ కప్పు లతో నా దగ్గరకొచ్చి కూర్చుంది నందిని. మేము వాన చూస్తూ కాఫీ ఎంజాయ్ చేస్తున్నాం.

''వానకి షెడ్డు మొత్తం కారిపోతుందయ్యా! ఆ కోతుల మంద వచ్చినప్పుడల్లా చెట్ల మీద నుంచి దూకి సిమ్మెంట్ రేకులన్నీ ఇరగ్గొట్టినయ్''– అంటూ మా ఎదు రుగ్గా వానలో తడుస్తూ నిలబడింది బాలమ్మ.

''నీ కొడుకు పెద్ద పెద్ద ఉజ్జోగాలేవో చేస్తున్నా డుగా, సిమ్మెంట్ రేకులు పరిపించకపోయావా?!'' అంది నందిని. ''అంతా ఆడ్ని మోసం చేసినోల్లే! ఏం చేయ్యను'' అంది బాలమ్మ.

''కొడుకు మీద మాట పడనీదు చూశారా?'' అంటూ నా వైపే చూసింది నందిని.

''అయితే రేకులు తెప్పిస్తా. నువ్వు, మీ ఆయన, మీ అబ్బాయి కలిసి వేయించుకోం''డన్నాను.

''అబ్బాయి ఇట్టాటిపనులెట్టా చెత్తాడయ్యా? మోటు పనులు మాలాగా చెయ్యలేడు. సదువుకున్నోడుగా!'' అంది బాలమ్మ. కదలకుండా అలాగే వర్షంలో నిలబడింది.

''మేస్త్రీతో చెబుతాలే'' అనే వరకు వర్షంలో నిల బడే ఉంది.

వర్షాలు రెండు రోజుల్లో తెరిపిచ్చినయి. మేస్త్రీ కూలీలు వచ్చారు. రేకులు విప్పుతుంటే బయటకొ చ్చాడు బాలమ్మ కొడుకు.

''ఏమిటిదంతా? ఎంత టైం పడుతుంది? ఒక గంటలో అయిపోతుందా? అనడగి'' వాచీ చూసు కుంటూ ఇంట్లోకెళ్ళిపోయాడు.

పోలయ్యా, బాలమ్మ ఇంట్లో సామనంతా బయ టకి చేరుస్తుంటే, చూస్తూ వాక్‌మెన్‌లో పాటలింటూ బయటే నిలబడ్డాడు బాలమ్మ కొడుకు. పనోళ్ళంతా చెమటలు కక్కుతూ సిమ్మెంటు, ఇసుక, కంకర, ఇటుక రాళ్ళు మోస్తున్నారు. నేనదంతా గమనిస్తున్నాను అక్కడే నిలబడి.

పని చేయడానికొచ్చిన కుర్రాడొక్కడు–నన్ను పిలిచి సిమ్మెంటు బస్తాలు చూస్తూ ఉండమని చెప్పి, ఇటుకరాళ్ళు చేరవేస్తున్నాడు. నాకర్థం కాక మేస్త్రీ వంక చూశా. అతన్నేమీ అనొద్దనీ తాపీతో సైగ చేశాడు మేస్త్రీ. అర్థం అయింది నాకు.

పని జరుగుతూనే ఉంది. ఒక్కసారైనా షెడ్డు దగ్గ రకు రాలేదు నా మేనల్లుడు. పనికవసరమైన సామాన్లు తెద్దామని బయలుదేరబోతుంటే కారు వెనుక టైర్‌లో గాలిపోయింది. నా మేనల్లుడ్ని పిలిచి, ''టైర్ మార్చి, స్టెప్నీ ఎక్కించరా'' అన్నాను. కారు టైరు వంక ఎగాదిగా చూసి, ''ఇది నా పని కాదు. మెకానిక్ పని'' అని చెప్పి ఇంట్లోకెళ్ళిపోయాడు. ఎవరో కుర్రాడిని పిలుచుకొ చ్చాడు. పట్టుమని పదేళ్ళన్నా లేని మెకానిక్ కుర్రోడు వచ్చి పది నిమిషాల్లో టైర్ మార్చేశాడు. అతని పనితనా నికి ఆశ్చర్యం వేసింది. ''ఏం చదువుకుంటున్నావు?'' అనడిగా. ''బడికెల్తే కడుపుకెట్టాసార్?'' అన్నాడు వేదాం తిలా.

రెండు రోజుల్లో పూర్తవుతుందని అనుకున్న పని నాలుగు రోజులు పట్టింది. మనిషి కూలీ రోజుకు నూట యాభై రూపాయలు. మేస్త్రీకి రెండొందల యాభై.

మేస్త్రి కూలి డబ్బులిస్తూ–నన్ను సిమ్మెంట్ బస్తా లకు కాపలా ఉండమన్న కుర్రోడి గురించి అడిగా.

''ఆ రాముగాడా? ఏమనుకోకండి. ఆడికి కొంచెం తెలివి తక్కువ సార్! తిక్కలోడు. ఏ పని చెప్పినా ఎందుకు? దేనికని ఎదురడగకుండా చేస్తాడు. అందుకే అందరితో పాటు వాడ్ని కూడా రోజు పనికి తీసుకెల్తా. అందరితో సమానంగా కూలి కూడా ఇస్తా. ఆడి బాబు మా ముటావోడే. తాగి తాగి లివర్ పాడై చచ్చాడు. టిబి వచ్చిన తల్లిని ఈ రామే పనిచేసి పోషిస్తున్నా డంటూ'' అతని గురించి గర్వంగా చెప్పాడు మేస్త్రి.

రాముని చూస్తే నాకు చాలా ముచ్చటేసింది. తెలి వితక్కువ ఎవరికి? పట్టుమని పదహారేళ్ళయినా లేని అతను ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా వంచిన నడుం ఎత్తకుండా పనిచే స్తాడు. మిగిలిన పనోళ్ళలాగా బీడీలు తాగుతూ టీలు కోసం వెల్తూ టైం వేస్టు చెయ్యడు. సిన్మాల సొల్లు కబుర్లు వినడు. రాము షెడ్డుకి వాటర్‌తో క్యూరింగ్ చేస్తున్నాడు. మిగతా పనోళ్ళంతా తమ సామాన్లు సర్దుకుంటున్నారు.

రాముని దగ్గరకు పిల్చి షేక్‌హ్యాండిచ్చి, ''రామూ! పని బాగా చేశానా?'' అనడిగా.

''వెరీగుడ్డు'' అన్నాడు నవ్వుతూ.

మేస్త్రీ అందరికీ కూలి డబ్బు పంచుతున్నాడు. రాముకి కూడా లెక్కగట్టి ఇచ్చాడు. బయటున్న సామాన్లు ఇంట్లోకి సర్దుతున్న బాలమ్మ మా దగ్గర కొచ్చి, ''ఏంటి? ఈ తిక్కల పిల్లోడికి కూడా అందరి లాగా రోజుకి నూటయాభై రూపాయలు కూలిస్తు న్నావా అన్నా?'' అనడిగింది మేస్త్రీని.

''అందరితో పాటు పనిచేస్తున్నాడు. అందరితో పాటు సమానంగా డబ్బులిస్తున్నా'' అన్నాడు మేస్త్రి.

''అట్టయితే మా అబ్బాయి కూడా వీళ్ళతో పాటు ఏదన్నా పనివ్వన్నా...పనీపాటా లేక పద్దాక టీవి సూత్తా ఇంట్లోనే పడుంటున్నాడు'' అంది బాలమ్మ.

''ఇట్టాంటి మోటు పనులు మీ అబ్బాయి సేత్తాడా? సదువుకున్నాడు కదా?'' అన్నాడు మేస్త్రి నవ్వుతూ. బాలమ్మ మోహం మాడి పోయింది.

***

రెండు రోజుల తర్వాత ఊరు నుంచి అక్క ఫోన్ చేసింది. ''మేనల్లుడ్ని ఏదన్నా పనిలో పెట్టావంట్రా'' అని అడిగింది.

''వాడ్ని ఈ రోజే ఊరు పంపుతున్నా. సదువుకున్నోడికి నేనేం పని చూపించగలనే అక్కా'' అంటూ ఫోన్ పెట్టేశా.

కోతులకు, పిల్లులకున్న జ్ఞానం ఈ తల్లులకు లేక పోయా!

*

రచయిత సెల్: **94407 47768**

